# అమ్మాయిలూ... జాగ్రత్త!

*ఆంధ్రభూమి వీక్లీ.. 21 మార్చి, 2002*



"శైలూ..! నాన్నగారు పిలుస్తున్నారు. ఇలా రా!"
విజయ కూతుర్ని పిలిచింది.

శైలజ తండ్రి ముందు నిలబడి 'ఏమిట'న్నట్టు చూసింది.

"నేను విన్నది నిజమేనా?" తీక్షణంగా కూతుర్ని చూస్తూ అడిగాడు శ్రీనివాస్.

"మీరు ఏం విన్నారో చెబితే కదా... నేను నిజమో, కాదో చెప్పటానికి?"

ఒక్కక్షణం కూతురి మాటలకి విపరీతమయిన కోపం వచ్చింది శ్రీనివాస్‌కి.

ఎలాగో తమాయించుకుని-

"నీవు ఎవడితోనో తిరుగుతున్నావట... నిజమేనా?" అని అడిగాడు.

"అంతకంటే మంచి భాషలో అడగలేరా?"

"నోర్ముయ్ః... ఏమిటా మాటలు? చిన్నా, పెద్దా లేకుండా..!" కూతుర్ని మందలించింది విజయ.

శైలజ ఏం మాట్లాడలేదు.

"సరే..! నీవు చేస్తున్నదేమిటో నీకు తెలిసిన భాషలో, నాకు అర్థమయ్యే భాషలో నీవే చెప్పు..?!" శ్రీనివాస్ అన్నాడు.

"నేను శశిని ప్రేమిస్తున్నాను!"

"శశి ఎవరు? ఏం చదివాడు? ఏం ఉద్యోగం చేస్తున్నాడు?"

"బి.కాం. చదివాడు. ఓ ఎస్.టి.డి. బూత్‌లో పనిచేస్తున్నాడు. మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు!"

"వాళ్ళ తల్లిదండ్రులు..?"

"తెలీదు. తండ్రికి ఎక్కడో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం అని చెప్పాడు!"

"అతని గుణగణాలు విచారించావా?"

"అన్నీ నచ్చాయి కనుకే ప్రేమించాను!"

"శైలూ..! దయచేసి అతన్ని మరచిపో! నేను నీకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేస్తాను. నేను కోరేది నీ సుఖమే కదమ్మా?" కళ్ళనీళ్లతో అన్నాడు శ్రీనివాస్.

"ఇప్పుడు నేను సుఖపడనని మీరు ఎందుకనుకుంటున్నారో నాకర్థంకావడం లేదు. శశి నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు!"

"నా కంఠంలో ప్రాణం వుండగా ఈ పెళ్ళి జరగనివ్వను!"

"నా పెళ్ళి శశితో జరిగితీరుతుంది! అలా జరగని పక్షంలో నా కంఠంలో ప్రాణం ఉండదు!" అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది శైలజ.

తల పట్టుకుని కూర్చుండిపోయాడు శ్రీనివాస్.

● ● ●

రాత్రి–

పదకొండు గంటలకు తన ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌ని చూసి ఆశ్చర్యపోయాడు భాస్కర్.

"రా... కూర్చో! ఏమిటి... ఇంత రాత్రివేళ వచ్చావు?"

"బ్రతికున్న శవాన్ని! నాకిక రాత్రీ, పగలు తేడా ఏముంటుంది?"

"ఏమిట్రా... ఏమైంది నీకు? లలితా! శ్రీనివాస్ వచ్చాడు. మంచినీళ్లు తీసుకురా!" అన్నాడు భాస్కర్.

నీళ్లు అందిస్తూ– "ఏమిటన్నయ్యా... ఎందుకలా ఉన్నారు?" అని అడిగింది లలిత.

ఇంట్లో జరిగినదంతా చెప్పాడు శ్రీనివాస్.

"ఒరేయ్ భాస్కర్! నేను శైలూను ఎలా పెంచానో, ఎలా చూసుకున్నానో నీకు తెలుసు. అది ఈరోజు వాడి ప్రేమమైకంలో మునిగి తండ్రని కూడా చూడకుండా ఎలా మాట్లాడిందనుకున్నావు?

అనుక్షణం నన్ను అంటిపెట్టుకొని, 'నాన్నా... నాన్నా' అంటూ నా వెనకే తిరిగిన శైలూయేనా ఇలా మాట్లాడింది? ...అని నాకే ఆశ్చర్యంగా ఉంది. చెప్పరా! నన్నేం చెయ్యమంటావు? ముక్కూ, ముఖం తెలియనివాణ్ణి, వాడేం చదివాడో, ఎలాంటివాడో తెలుసుకోకుండా శైలూని వాడి చేతిలో పెట్టమంటావా? నేను ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా... శైలూ మాత్రం అతనితో వెళ్లడం ఖాయం అని నాకనిపిస్తోంది!"

"నీవు ఆందోళన పడొద్దు. నేను శైలూతో మాట్లాడతాను. ఆ వయసులో వాళ్ళకి భవిష్యత్తు గురించి ఆలోచనగాని, తల్లిదండ్రుల మాటల్లోని ఆరాటంగాని అర్థంకాదు. నేను మా వాళ్ళకు చెప్పి అతని గురించి తెలుసుకోమంటాను. అతను మంచివాడే అయి, చదువుకున్నవాడయి వుంటే... నీవు మరేం ఆలోచించకుండా వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసేయి! ఈరోజుల్లో కూడా కులాల గురించి పట్టించుకోవద్దు. అతనికి ఒక మంచిఉద్యోగం చూపించడం నాకు సమస్య కాదు. నేను ఆలోచించేది అతని క్యారక్టర్ గురించే! శైలూలాంటి డిసిప్లిన్‌లో పెరిగిన అమ్మాయిని బుట్టలో వేసుకున్నాడంటే అతను అలాంటి విషయాల్లో మంచి ఎక్స్‌పర్ట్ అని నాకనిపిస్తోంది. అఫ్‌కోర్స్... ఈ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వల్ల నాకు అందర్నీ అనుమానించడం అలవాటయిపోయిందనుకో! ఎనీవే... రేపు మావాళ్ళకు చెప్పి అతని గురించి వాకబు చేయమంటాను. రెండురోజుల్లో నాకు వివరాలు అందుతాయి. నీవు నిశ్చింతగా ఉండు. శైలూ నీకు కూతురైనా- నాకూ కూతురులాంటిదే! నాకు తనంటే ఎంతో ఇష్టమని నీకు తెలుసు కదా!"

"అలాగే... మరి, నేను వెళ్తాను!"

శ్రీనివాస్ ముఖంలో ఇంకా ఆందోళన తగ్గకపోవటంతో- "పద..! నిన్ను డ్రాప్ చేస్తాను!" అంటూ స్కూటర్ బయటికి తీశాడు.

"ప్రక్క వీధేగా..! నేను వెళ్తాను!"

"ఫర్వాలేదు..."

- అంటూ శ్రీనివాస్‌ని ఇంటి దగ్గర దింపి, "నీవు శైలుతో ఈ విషయంలో ఇంకేం మాట్లాడకు. మళ్లీ గొడవలైతే అతని దగ్గరికి వెళ్లిపోవచ్చు. మేజర్ కాబట్టి మనం ఏం చేయలేం. నీ సమస్య నా సమస్యలా భావించి నీ ప్రాబ్లం సాల్వ్ చేస్తాను. నామీద నమ్మకం ఉంచు!" అన్నాడు భాస్కర్ మిత్రుడి భుజం తడుతూ.

"థాంక్యూరా! నీమీద నాకు నమ్మకం వుంది. నిన్ను నాకు మిత్రుడిగా ఇచ్చిన ఆ భగవంతునిపై కూడా నమ్మకం ఉంది. గుడ్‌నైట్..!"

"గుడ్‌నైట్!"

● ● ●

"ఏమిటండీ... ఏమిటలా ఉన్నారు..? ఆ అబ్బాయి వివరాలు తెలిశాయా?" లలిత అడిగింది భర్తని.

'అవు'నన్నట్టు తలూపాడు భాస్కర్.

"చెప్పండి... ఎలాంటివాడు ఆ అబ్బాయి? అన్నయ్యకి ధైర్యం చెప్పి, మీరిలా అయిపోయారేమిటండీ?"

"నేను డీలా పడలేదోయ్! ఆలోచిస్తున్నాను... అంతే! ఆ అబ్బాయి డిగ్రీ కూడా పూర్తిచేయలేదట. సిగరెట్లు, త్రాగుడు, అమ్మాయిలు... ఒకటేమిటి- అతనికి లేని వ్యసనం లేదట! డబ్బున్న ఓ ఫ్రెండు తన గర్ల్‌ఫ్రెండుని కలుసుకోవడానికీ, మాట్లాడుకోవడానికీ ఆ ఎస్.టి.డి. బూత్ పెట్టి ఇతన్ని చూసుకోమన్నాడట!"

"అయితే... ఇప్పుడెలాగండీ? అంత తెలివిగల పిల్ల ఎలా వీడి వలలో పడింది?"

"తెలివి ఎక్కువై అహంకారం పెరిగితే జరిగేదిదే! నేను శైలూని ఎలా దారిలో పెట్టాలో ఆలోచించాను. రేపు ఏదో పూజ సాకు చెప్పి, శైలూని మనింటికి రమ్మను. నేను మాట్లాడాలి!"

"అలాగే!"

• • •

మరుసటిరోజు ఇంటికొచ్చిన శైలూని అభినందించాడు భాస్కర్.

"కంగ్రాచ్యులేషన్స్ శైలూ..! ఎవరినో ప్రేమించావట..? పెళ్ళి కూడా చేసుకోబోతున్నావట?"

"థాంక్యూ అంకుల్! కనీసం మీరైనా నన్ను అర్థంచేసుకున్నారు!"

"ఇంతకీ... ఆ అబ్బాయి మన మునిసిపల్ లైబ్రరీ ప్రక్కనుండే ఆ ఎస్.టి.డి. బూత్‌లో పనిచేసే అతనేనా?"

"అవునంకుల్! మీరు చూశారా? మీకు నచ్చాడా?"

"నచ్చాడమ్మా! కాని, జీతం ఎంతట అతనికి?"

"వెయ్యి రూపాయలు వస్తాయట!"

"మరి, మీ ఇద్దరికీ నెలకు వెయ్యి రూపాయలు సరిపోతాయా? నాకు పదిహేనువేలు కూడా సరిపోవటం లేదు!"

"నేనూ ఉద్యోగం చేస్తాను అంకుల్! నాకు రెండువేలైనా వస్తాయి. మూడువేలు చాలు మా సంసారానికి!"

"ఎక్కడైనా ప్రయత్నిస్తున్నావా?"

"ఇంకా లేదు. ప్రయత్నించాలి! అతను కూడా మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాడట!"

"అలాగా... ఏం చదివాడతను?"

"బి.కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడట!"

"నాకు తెలిసిన ఫ్రెండుకి ఓ పెద్ద ఫ్యాక్టరీ వుంది. 'అకౌంటెంటు కావాలి' అని చెప్పాడు. శశిని సర్టిఫికెట్స్‌తో మా ఇంటికి వచ్చి కలవమను... నేను ఉద్యోగం ఇప్పిస్తాను. పెళ్ళి సమయానికి అతనికొక మంచి ఉద్యోగం ఉంటే నీ స్నేహితుల ముందు నీకు కాస్త గౌరవంగా వుంటుంది."

"అలాగే అంకుల్! తప్పకుండా మీ ఇంటికి పంపిస్తాను."

• • •

వారంరోజులైనా శశి అతని ఇంటికి రాకపోవడంతో శైలజని అడిగాడు.

"అతనికి రెకమండేషన్లతో ఉద్యోగం తెచ్చుకోవడం ఇష్టం లేదట అంకుల్! అతను చాలా ప్రిన్సిపల్డ్!" అంది శైలజ.

"వెరీగుడ్... ఐ లైక్ దట్! అయితే మీ నాన్న అతని చదువు గురించి, ఉద్యోగం గురించి సందేహిస్తున్నాడు. చదువుంటే ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. నీవు అతని సర్టిఫికెట్స్ నాకు చూపించావంటే నేను మీ నాన్నను ఒప్పిస్తాను!"

"అలాగే! రెండురోజుల్లో మీకు తెచ్చిస్తాను."

రెండురోజుల తర్వాత భాస్కర్‌తో అంది-

"సారీ అంకుల్! ఆయన సర్టిఫికెట్లు ఏదో ఇంటర్వ్యూ కెళ్లి వస్తూంటే ట్రైనులో పోయాయట! డూప్లికేట్స్‌కి అప్లై చేశారట!"

"అలాగా..? అవి వచ్చాకే చూపించు!"

శైలజకి కూడా అతని చదువు గురించి అనుమానమొచ్చిందని అర్థమైంది భాస్కర్‌కి.

• • •

"హలో శైలూ..! నేను భాస్కర్‌ని! ఈరోజు మంచిరోజని మీ నాన్న మా ఇద్దర్నీ శశి ఇంటికెళ్లి వాళ్ల పెద్దవాళ్లతో మాట్లాడి రమ్మన్నారు. నువ్వూ వస్తే బాగుంటుంది!"

"అలాగే అంకుల్!"

"మేము ఇంకో గంటలో వస్తాం... నువ్వు రెడీగా వుండు!"

• • •

కారులో చెప్పాడు భాస్కర్-

"శైలూ..! ధైర్యంగా ఉండు. ఒకవేళ వాళ్ల తల్లిదండ్రులు ఒప్పుకోకపోయినా, నిన్నేమైనా అన్నా నువ్వేమీ బాధపడకూడదు. కీడెంచి మేలెంచాలి కదా..!"

"సుబ్రమణ్యంగారి ఇల్లు ఇదేనాండి?" బయటినుంచే శశిధర్ తల్లిని అడిగాడు భాస్కర్.

"అవునండీ..! మీరు..?"

"నా పేరు భాస్కర్. నా ఫ్రెండు కూతుర్ని మీ అబ్బాయి శశిధర్‌కి అడుగుదామని వచ్చాము!"

"రండి... కూర్చోండి! ఆయన బయటకి వెళ్లారు!" అంది శశిధర్ తల్లి.

"అలాగా..? కాస్త మంచినీళ్లు ఇస్తారా?" అన్నాడు భాస్కర్ సోఫాలో కూర్చుంటూ.

ఆమె 'అలాగే'నంటూ లోపలికి వెళ్లింది.

భాస్కర్ హాలు దాటి లోపలికి వెళ్లి వెంటనే ముక్కు మూసుకుని హాల్లోకి వచ్చాడు.

'ఏమి'టన్నట్టు కళ్లతోనే ప్రశ్నించింది శైలజ.

"నీవే వెళ్లి చూడు!" అన్నాడు.

శైలజ వెళ్లి చూసింది. లోపల బెడ్‌రూమ్‌లో శశిధర్ నిద్రపోతున్నాడు. గదంతా ఆల్కహాల్ వాసన!

అక్కడ ఒక్కక్షణం కూడా నిలువలేక తిరిగి హాల్లోకి వచ్చింది ఆమె.

ఆమె శశిధర్‌ని అలా చూసి షాకయిందని అర్థమైంది భాస్కర్‌కి.

శైలజ గదిలోంచి బయటకి రావడం చూసిన శశిధర్ తల్లి భాస్కర్‌కి మంచినీళ్ల గ్లాసు అందిస్తూ-

"నిజం చెప్పండి! మీరు ఏ కారణంగా మా ఇంటికొచ్చారు?" అంది సీరియస్‌గా చూస్తూ.

"నిజంగా పెళ్ళిసంబంధం కోసమే వచ్చాము. ఈ అమ్మాయే నా ఫ్రెండు కూతురు. అబ్బాయిని ఒకసారి చూడాలని వచ్చాము!"

"మేము ఇప్పుడిప్పుడే వాడి పెళ్ళి చేయటం లేదు. వాడు ముందు మంచిదారిలో పడాలి. చెడు స్నేహాలు వదలాలి. నేనూ, ఆయనా ఎంత చెప్పినా మారటం లేదు. ఈ పరిస్థితుల్లో ఇంకో అమ్మాయి గొంతు కొయ్యటం నాకిష్టం లేదు. మీరు మరో సంబంధం చూసుకోండి!"

ఆ మాట అంటున్నప్పుడు ఆమె కంట్లో నీరు తిరిగింది.

"మీరు బాధపడకండి. అబ్బాయి తప్పక మారతాడు. ఆ భగవంతుడినే నమ్ముకోండి. మేము వస్తాము!" అంది లలిత.

ముగ్గురూ ఆమె దగ్గర సెలవు తీసుకొన్నారు.

● ● ●

దారిలో ఓ హోటల్ ముందు కారాపాడు భాస్కర్... టిఫిన్ ఆర్డరిచ్చాడు ముగ్గురికీ.

తర్వాత శైలజతో అన్నాడు-

"చూడమ్మా శైలూ..! నీ శ్రేయోభిలాషిగా నేను చెప్పేది విను. పూర్తిగా విన్నాక నీ నిర్ణయం చెప్పు. శ్రీనివాస్ నిన్ను ఎంతో గారాబంగా పెంచాడు. నీకు మామూలు జ్వరం వస్తేనే కళ్ళలో నీళ్లు పెట్టుకునేవాడు. నువ్వు అడిగినవన్నీ కొనిచ్చేవాడు. నేను అంటూండేవాణ్ణి- 'శైలూని మరీ గారాబం చేయకు. మొండితనం వస్తుంది' అని. 'శైలూకి గారాబంతోపాటు మంచితనం, మానవత్వం, పెద్దల పట్ల గౌరవం, కష్టపడటం, చదువు ప్రాముఖ్యం గురించి ఎంతో బాగా వివరించాననీ, ప్రతిరోజూ వాటి గురించి చెబుతున్నాననీ, అందువల్ల శైలూ మంచిపిల్లగానే పెరుగుతుంద'నీ చెప్పేవాడు.

నువ్వూ అలాగే నిరూపించుకున్నావు కూడా! కాని, కొందరు ఆడపిల్లల్లా నువ్వూ ఒక్క ప్రేమ విషయంలోనే పప్పులో కాలేశావు. నీ వయసులో వాళ్ళకి అందంగా ఉండి, తమపై కొంత ఆసక్తి చూపించే మగవాళ్ళపై మమకారం పెంచుకోవడం సాధారణం. కొంతమంది తల్లిదండ్రుల హెచ్చరికలతో మనసు మార్చుకుంటారు. నీలా తెలివితేటలు, ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉన్న అమ్మాయిలు తమ మాటే చెల్లాలంటారు. నిజమే... మీ సెలక్షన్‌లో తప్పు లేనంతవరకు మీ ప్రేమల్ని కాదనే హక్కు ఆ భగవంతుడికి కూడా లేదు. ఎటొచ్చీ- మీ నిర్ణయం సరైనది కానప్పుడు, మీ సెలెక్షన్ తప్పయినప్పుడు... మీకు నచ్చజెప్పే హక్కు మంచి దారిలో పెట్టే బాధ్యత మాకుందని మీరు మరవకూడదు.

మీ నాన్న నీ ప్రేమ విషయం చెప్పగానే- నేను శశిధర్ గురించి వాకబు చేశాను. ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న నాకు అతని గురించి తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు. వాడికి అన్ని చెడుఅలవాట్లూ ఉన్నాయి. చదువు డిగ్రీ మొదటి సంవత్సరంలో ఆపేశాడు. తల్లిదండ్రులంటే ఏమాత్రం గౌరవం లేనివాడనీ, ప్రతిరోజూ ఇంట్లో గొడవలు సృష్టిస్తాడనీ, తండ్రి ఇంట్లోనుంచి వెళ్లిపొమ్మని చెప్పినా- వినడం లేదని తెలిసింది. ఈ విషయం నీకు ముందే చెబితే... మీ నాన్న మాటలు విని నీ మనసు మార్చడానికే నేనలా చెప్తున్నానని అనుకొంటావు.

అందుకే... నీ వైపే ఉన్నట్లు నటించి, నీకే ప్రత్యక్షంగా చూపించాను. మిగతా విషయాలు కూడా నిరూపించగలను. కాని నువ్వు మరీ అంత తెలివితక్కువ పిల్లవి కావని నా నమ్మకం. ఒకవేళ అతను చదువుకుని, మంచి క్యారెక్టర్ గలవాడే అయివుంటే... అతనితో నీ పెళ్ళి జరిపించడానికి మీ నాన్నకీ, నాకూ ఏ అభ్యంతరం ఉండేది కాదు. మాకు నీ క్షేమం, ఆనందం ముఖ్యం అని గ్రహించు. జరిగింది మర్చిపో! ఎమ్.ఏ.కో..., ఏం.బి.ఏ.కో అప్లై చేయి. హాయిగా చదువుకో. ఈలోగా మీ నాన్న మంచిసంబంధం చూసి నీకు పెళ్ళిచేస్తాడు!"

"చూడమ్మా శైలూ! శశిధర్ తల్లితో మనకు ఇదివరకు పరిచయం లేదు. అయినా ఆవిడ బాధని చూసిన మన ముగ్గురికీ కళ్ళలో నీళ్లు వచ్చాయి. అటువంటిది- రేపు నీకు అతనితో పెళ్ళయి, నీవూ అలా బాధపడుతూంటే మాకు... ముఖ్యంగా మీ అమ్మానాన్నలకు ఎలా వుంటుంది చెప్పు? పైగా- కన్నతల్లిని సుఖపెట్టలేనివాడు పెళ్ళాన్ని సుఖంగా ఉంచుతాడని నాకు నమ్మకం లేదు!" అంది లలిత.

"ఇప్పుడు చెప్పు శైలూ- నీవేం చెప్పదలచుకొన్నావో..?!" అన్నాడు భాస్కర్.

"నన్ను క్షమించండి అంకుల్!" కళ్ళనీళ్లతో అంది శైలజ.

"పదండి... నాన్నగారి దగ్గరికెళదాం! ఆయన మనసు ఎంతో బాధపెట్టాను. నన్ను క్షమించమని అడగాలి!"

"గుడ్... నౌ యు ఆర్ అవర్ డియర్ శైలూ!"

- షేక్ హాండ్ ఇస్తూ అన్నాడు భాస్కర్ ఆనందంగా.